సాక్షి రంగారెడ్డి

శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



బిల్లులు చెల్లించండి

మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని సంఘం అధ్యక్షురాలు స్వప్న డిమాండ్ చేశారు. 8లో▸



రూ.5లక్షలతో వాటర్ ప్లాంట్

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



30 వృక్షాల నరికివేత

శంకరకొండతాండాలో ఈజీఎస్ క్రింద నాటిన చెట్లను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు 'కన్హా'కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కన్హా శాంతి వనం

నందిగామ: మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో నిర్వహిస్తున్న రైసింగ్ విత్ కైండ్‌నెస్ కార్యక్రమానికి శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని కన్హా శాంతి వనం నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30గంటలకు సీఎం రానున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విమలక్కకు సన్మానం



విమలక్కను సన్మానిస్తున్న వెంకటేశ్ తదితరులు

తలకొండపల్లి: ప్రజా ఉద్యమాల పోరాట వనిత, అరుణోదయ ఉద్యమకారిణి, ప్రజా సమస్యలపై తన గళం విప్పి కళాబృందంతో పోరాటం కొనసాగిస్తున్న విమలక్కను, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ శుక్రవారం హైదరాబాద్‌లో శాలువాతో ఘనంగా సన్మానించారు. నేటికీ ప్రజాపోరాటంలో ఉద్యమ గాయకురాలికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్, సిద్దగోని, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పరీక్షలు తప్పనిసరి

జిల్లా అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి పాపారావు

తుర్కయంజాల్: రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశానుసారం రంగారెడ్డి జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ (దిశ), జిల్లా ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యారోగ్యశాఖ భవనంలో హెచ్‌ఐవీ కౌన్సెలింగ్, స్క్రీనింగ్‌పై మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పాపారావు మాట్లాడుతూ.. ఎయిడ్స్‌పై అవగాహన కల్పించి.. ప్రతీ ఒక్కరు పరీక్షలు చేయించుకునేలా చూడాలని కోరారు. 2030 వరకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ను అంతమొందించాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో దిశ మేనేజర్ నరేందర్, క్లినికల్ సర్వీసెస్ ఆఫీసర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి

తుర్కయంజాల్: పీఆర్టీయూ టీఎస్ హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం నారాయణగూడలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా టి.తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.మధుసూదన్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా అనిరుధ్ రావు, మన్సూర్ అలీ, అసోసియేట్ అధ్యక్షులుగా ప్రశాంత్ రెడ్డి, ప్రతాపరెడ్డి మాధురి, ఉపాధ్యక్షులుగా డి.వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాసన్, దేవేందర్, వెంకట్‌రెడ్డి, శ్రీనాథ్, జ్యోతి, కార్యదర్శులుగా అశోక్, నారాయణ, సైదులు, నరేందర్, సురేశ్ రెడ్డి, రేణుకను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పెంటయ్యగౌడ్

వైస్ చైర్మన్‌గా రాములు



పెంటయ్యగౌడ్



రాములు

చేవెళ్ల: చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌కు నూతన కమిటీ నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా గడ్డమీది పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్‌గా బ్యాగరి రాములు, డైరెక్టర్లుగా పడాల లలిత, తీగ యాదిరెడ్డి, వై.బాలయ్య, జి.నరేందర్, ఎండీ హనీఫ్, ఎన్.మల్లేశ్, కె.సత్యనారాయణ, జి.సుదర్శన్, కె.యాదయ్య, టి.జనార్దన్, కె.వెంకట్‌రెడ్డి, ఎ.కృష్ణారెడ్డితో పాటు చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జిల్లా మార్కెట్ అధికారి, చేవెళ్ల ఏడీఏ, చేవెళ్ల ప్రత్యేకాధికారి పాలకవర్గంలో ఉంటారు.



ఇబ్రహీంపట్నం: టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ (జూనియర్ కళాశాల)లో మరుగుదొడ్ల దుస్థితి

తలుపులు లేని మరుగు!

గురుకులాల్లో వసతులు లేక విద్యార్థుల ఇబ్బందులు

టాయిలెట్స్ సరిగా లేక తిప్పలు ☛ మరమ్మతులను పట్టించుకోని వైనం

గురుకులాల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. అద్దెభవనాల్లో కొనసాగుతున్న పాఠశాలల్లో అధ్వాన పరిస్థితులు కనిపిస్తున్నాయి. సరిపడా బాత్రూంలు లేక ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టక అపరిశుభ్రంగా మారాయి. టాయిలెట్ వెళ్లేందుకు సైతం విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.



అద్దెభవనం.. అరకొర వసతులు

కందుకూరు: మండల పరిధిలోని గూడూరు చౌరస్తా వద్దనున్న మహేశ్వరం ఎస్సీ బాలికల గురుకులంలో మొత్తం 640 మంది విద్యార్థినులున్నారు. వీరి సంఖ్యకు అవసరమైన మరుగుదొడ్లు, స్నానపు గదులు 64 చొప్పున ఉండాలి. కానీ 18 కంబైన్డ్‌గా, మరో 19 స్నానపు గదులు, 19 మరుగుదొడ్లు ఉన్నాయి. మరో పది వరకు అవసరం ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలకు ఉన్న తలుపులు పాడయ్యాయి. తలుపులకు మరమ్మతులు చేయించడం.. కొత్తవి ఏర్పాటు చేయడం తదితర పనులు ఏవీ చేయలేదు. అద్దె భవనం అవ్వడంతో ఎవరు మరమ్మతులు చేయించాలనే మీమాంసతో పనులు నిలిచిపోయాయి. ఇదే విషయమై ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి స్పందిస్తూ సెలవుల్లో తామే మరమ్మతులు చేయిస్తామన్నారు.

540 మందికి 44 టాయిలెట్స్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్(జూనియర్ కళాశాల)లో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఈ పాఠశాలలో 540 మంది విద్యార్థులకు గాను 44 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఉన్నావాటికి సైతం తలుపులు లేకపోవడం.. ఇనుప తలుపులు తుప్పు పట్టి పాడయ్యాయి. కాలకృత్యాలకు తీర్చుకునేందుకు కనీసం మగ్గు, బకెట్ సదుపాయం కూడా లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అదనపు మరుగుదొడ్లు నిర్మించి.. పాడైన వాటికి మరమ్మతులు చేయించి తమ ఇబ్బందులు దూరం చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

తలుపులు విరిగాయి



మరుగుదొడ్లు, స్నానపు గదులు తలుపులు చాల వరకు విరిగిపోయాయి. ఉన్నవాటితోనే కాలకృత్యాలు తీర్చుకోవడం, స్నానాలు చేస్తున్నాం. చాలా ఇబ్బందిగా ఉంది. మరమ్మతులు చేయిస్తే బాగుంటుంది.

– గురుతపస్వి, విద్యార్థిని, మహేశ్వరం ఎస్సీ గురుకులం

సెలవుదినాల్లో మరమ్మతులు



గతంలో అద్దెలోనే ఐదు శాతం మార్జిన్ మరమ్మతుల కోసం కేటాయించేవారు. ఇప్పుడు అద్దె అంతా చెల్లిస్తున్నాం. కొన్ని మరుగుదొడ్ల తలుపులు విరిగిన మాట వాస్తవమే. సెలవుల్లో అన్నింటికి మరమ్మతులు చేయిస్తాం.

– శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్, మహేశ్వరం ఎస్సీ గురుకులం

స్టార్టప్‌లకు కేంద్ర ప్రోత్సాహం

- యువత చేతిలోనే దేశ భవిష్యత్
- కేంద్ర మంత్రి మన్‌సుక్ మాండవీయ
- కన్హాలో 'రైజింగ్ విత్ కైండ్‌నెస్' సమ్మిట్ ప్రారంభం

నందిగామ: యువ పరిశోధకులు, స్టార్టప్‌లను కేంద్ర ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక ఉపాధి శాఖ మంత్రి మన్‌సుక్ మాండవీయ అన్నారు. నందిగామ మండలంలోని కన్హా శాంతి వనంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ×రైజింగ్ విత్ కైండ్‌నెస్÷ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందన్నారు. యువ స్టార్టప్‌లకోసం కేంద్రం నుంచి ప్రత్యేక రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. గత ఏడు నెలల్లో మై భారత్ ప్లాట్ ఫాం ఏర్పాటు చేశామని, ఇందులో 33 లక్షల భారతీయ కంపెనీలు ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నాయని స్పష్టంచేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో యువత కోసం కేంద్రీకృత బడ్జెట్ కేటాయించామని వెల్లడించారు. రాబోయే 25 ఏళ్లలో క్రీడా రంగంలో భారత్‌ను ప్రపంచంలో టాప్ ఐదవ స్థానానికి తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.



కేంద్ర మంత్రి మన్‌సుక్ మాండవీయాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమ్లేష్ పటేల్

ధ్యానంతోనే ప్రశాంతత..

ప్రతిఒక్కరూ వీలైన సమయంలో ధ్యానం చేయాలని.. దీని ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు, హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమ్లేష్ డి.పటేల్ అన్నారు. అంతకు ముందు సహజమార్గ్, ది హార్ట్ ఫుల్‌నెస్ వే, డిజైనింగ్ డెస్టినీ, హార్ట్ ఫుల్‌నెస్ డైరీలను కేంద్ర మంత్రితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయేద్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ ది ఎన్విరాన్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హమ్దాన్ అల్‌షేర్, కామన్వెల్త్ సెక్రటరీ సుశీల్‌రామ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్‌సీ ఆగర్వాల్ అభ్యాసీలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

మాతాశిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్: మాత, శిశు సంరక్షణకు వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికి తిరిగి గర్భిణుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. మాతా శిశు మరణాలను తగ్గించేందుకు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తగిన చర్యలు తీసుకోవాన్నారు.

వైద్యులు దైవసమానులు: ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... ఆపద సమయంలో ఆసుపత్రికి వచ్చిన వారికి ప్రాణం పోసే వైద్యులు దైవ సమానులు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన వారికి వైద్యులు ఓపికతో వైద్యం చేయాలని సూచించారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మరింత మెరుగు పరిచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాత శిశు సంరక్షణ జిల్లా అధికారి పూర్ణిమ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ తిరుపతిరావు, శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హలో..



ఇక్కడ చెత్త వేయొద్దు!

- ఏఐతో పారిశుద్ధ్య సమస్యలకు చెక్
- చెత్త వేసేవారిని గుర్తించి పెనాల్టీలు
- కార్మికుల్లేకుండానే చెత్త సేకరణ
- కార్యాచరణకు సిద్ధమవుతున్న జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎన్ని చర్యలు చేపట్టినా చెత్త సమస్య పరిష్కారం కావడం లేదు. ఈ నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను చెత్త సమస్య పరిష్కారానికి వినియోగించుకునేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతోంది. ఏఐ వినియోగంతో చేసే పనుల్లో బహిరంగ ప్రదేశాల్లో ఎవరు చెత్తను వేస్తున్నారో గుర్తించి హెచ్చరించడంతో పాటు వారి వైఖరి మారకుంటే పెనాల్టీలు విధించడం ఒకటి కాగా..పారిశుద్ధ్య కార్మికుల ప్రమేయం లేకుండానే కాంటాక్ట్‌లెస్‌గా చెత్తను సేకరించడం మరొకటి. ఈ రెండు పనులను చేసేందుకు రెండు ప్యాకేజీలుగా జీహెచ్‌ఎంసీ ఆసక్తి వ్యక్తీకరణ బిడ్స్ ఆహ్వానించింది. ఏఐ ఆధారిత కెమెరాలు, సెన్సర్ల ద్వారా బహిరంగ ప్రదేశాల్లో చెత్త పోగవుతున్న ప్రాంతాల్లో ఎవరు చెత్తను వేస్తున్నారో గుర్తిస్తారు. ఎవరైనా అక్కడ చెత్త వేస్తున్నప్పుడు అక్కడ అమర్చే మైకు ద్వారా 'హలో.. ఇక్కడ చెత్త వేయవద్దు.. భారీ పెనాల్టీ పడుద్ది' అనే వ్యాఖ్యానాలు వినిపించేలా ఏర్పాట్లుంటాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ, వాటివల్ల ఆశించిన ఫలితం కనిపించలేదు. కొత్తగా ఏర్పాటు చేయబోయే కెమెరాలు ఏ ఉపరితలంపైన అయినా అమర్చవచ్చు. అవి 360 డిగ్రీల కోణంలో పని చేస్తాయని సంబంధిత అధికారి తెలిపారు. దాంతో తరచూ చెత్తవేసే వారిని గుర్తించి పెనాల్టీలు విధించడం ద్వారా వారు మారేలా చేస్తారు.

కాంటాక్ట్‌లెస్‌గా చెత్త సేకరణ..

పారిశుద్ధ్య కార్మికుల ప్రమేయం లేకుండానే కాంటాక్ట్‌లెస్‌గా చెత్త సేకరణ జరిగేందుకు ప్రత్యేక యంత్రాలు కలిగిన వాహనాలను వినియోగిస్తారు. వీటిల్లో ఉండే ట్రాష్ కలెక్షన్ మిషన్లు చెత్తను లాక్కుంటాయి. తొలుత రోడ్లపై చెత్త ఎక్కువగా పోగుపడుతున్న ప్రాంతాల్లో కానీ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి వీఐపీలుండే ప్రాంతాల్లో కానీ వీటిని ఏర్పాటుచేసే యోచనలో అధికారులున్నారు. ఈ ప్రత్యేక వాహనాల ద్వారా రోడ్ల వెంట చెత్త ను రోజుకు దాదాపు రెండు టన్నుల వరకు తొలగించవచ్చునని చెబుతున్నారు. మరోవైపు చెత్తను విభజించే సాంకేతికతను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అంటే చెత్తలో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలు, సీసాలు, ఫుడ్ ప్యాకేజీ, కాగితాలు, సిగరెట్ పీకలు వంటి వాటిని వేర్వేరుగా గుర్తించగలిగే సాంకేతికతను వినియోగించుకుంటారు. ఇలా ఏఐతో జీహెచ్‌ఎంసీ చెత్త సమస్యలకు పరిష్కారం లభించగలదని అధికారులు భావిస్తున్నారు.చెత్త సమస్య పరిష్కారమైతే చెత్త, దుర్గంధం, వాటివల్ల వ్యాప్తి చెందే వ్యాధులను కూడా నివారించవచ్చునని అధికారులు చెబుతున్నారు.

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిలుక మధుసూదన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా సీహెచ్ భాస్కరాచారిలను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలి సభ్యులుగా అంజయ్య, లక్ష్మి, చిన్నరెడ్డి రఘుపతి రెడ్డి, చుంచు నర్సింహ, చిలకూరి రామచంద్రారెడ్డి, మెగావత్ గణేష్, జయపాల్ రెడ్డి, కులపతి నవరాజ్, బండి మధుసుదన్ రావు, బోయపల్లి గోవర్ధన్, మహమ్మద్ అబ్దుల్ ఇబ్రహీం, జి.వెంకటేశ్వర్లుతో పాటు హయత్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్, జి ల్లా మార్కెటింగ్ కమిటీ అధికారి, హార్టికల్చర్ ఏడీ, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్మన్‌లు ఉంటారు.



చిలుక మధును సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

'సీజీఆర్' సేవలు ప్రశంసనీయం

- రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్ తివారీ
- ముగిసిన 'స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ లీడర్స్'శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వ్యాయామ ఉపాధ్యాయులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న రాజేశ్వర్ తివారీ

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ 14 ఏళ్లుగా చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాష్ట్ర విశ్రాంత స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్ తివారీ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో సీజీఆర్–తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ లీడర్స్'కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ ఓరియెంటేషన్‌కు కరీంనగర్, నల్గొండ, కామారెడ్డి జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు, నల్గొండ డీఎస్పీ లక్ష్మీపతి హాజరయ్యారు. సీజీఆర్ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి అధ్యక్షత నిర్వహించిన శిక్షణకు ముఖ్య అతిథులుగా రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్ తివారీ, పర్యావరణవేత్త జీఎస్ఆర్ అన్నమయ్య, పర్యావరణ ఉద్యమకారులు సురేశ్‌గుప్తా, ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త సాయిభాస్కర్ రెడ్డి, డెక్కన్ బర్డ్స్ సురేఖ, డాక్టర్ శామ్యూల్ శుకమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ తివారీ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కొరకు సీజీఆర్ సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమన్నారు. పర్యావరణ రక్షణ కార్యక్రమాల్లో యువత, విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రధాన భూమిక పోషించాలన్నారు. ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు, వ్యాయామ ఉపాధ్యాయుల మధ్య ఉండాల్సిన స్నేహభావంపై వివరించారు. విద్యార్థి దశనుంచే పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని వారికి వివరించారు. పర్యావరణ శాస్త్రవేత్త సాయిభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. జీవ వైవిధ్యం, మట్టి మహత్యం, విత్తన సంరక్షణ, బొగ్గు సంరక్షణ, బయో ఇంధనం వాడకం, అటవీ ప్రాంతంతో ముడిపడి ఉన్న జీవవైవిధ్య ప్రాధాన్యత అనే అంశాలపై సమగ్రంగా వివరించారు. సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా చేపట్టిన పర్యావరణహిత కార్యక్రమాలను వివరించారు. చేనేత వస్త్రాలు, ఈత చాపల వాడకాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని సురేశ్ గుప్తా కోరారు. జీఎస్ఆర్ అన్నమయ్య వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఆయా జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్తలు ఉమా మహేశ్వర్‌రెడ్డి, కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, రోహిణి శ్రీ వైష్ణవి, సీజీఆర్ కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, పర్యావరణవేత్త పాలడుగు జ్ఞానేశ్వర్, ఐఈఎస్ స్పెషలిస్ట్ అన్నమయ్య, అడ్మిన్ అధికారి అనుదీప్, ప్రోగ్రాం ఆఫీసర్స్ నగేశ్, రజనీకాంత్, లక్ష్మీప్రసన్న, సీజీఆర్ ప్రతినిధులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్

అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని బండోనిగూడలో కాంగ్రెస్ నాయకుడు పసుల బుచ్చయ్య సొంత డబ్బులు వెచ్చించి రూ.5లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణకు బుచ్చయ్య సొంత డబ్బుతో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలో మహిళా భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, నాయకులు కృష్ణ, నర్సింహ, శ్రీశైలం, రాజు, యాదయ్య, శ్రీశైలం, తిరుపతి, పాండు, ఆంజనేయులు, మల్లేశ్, కుమార్, అశోక్, బాలకృష్ణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

30 వృక్షాల నరికివేత

పోలీసులకు ఎంపీడీఓ ఫిర్యాదు

ఆమనగల్లు: శంకరకొండతండాలో ఈజీఎస్‌లో భాగంగా నాటిన చెట్లను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. రోడ్డు పక్క నాటిన దాదాపు 30 చెట్లను నరికివేయగా శుక్రవారం ఉదయం ఎంపీడీఓ కుసుమ మాధురి పరిశీలించారు. చెట్లను నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ కుసుమమాధురి తెలిపారు.



శంకరకొండ తండాలో నరికేసిన చెట్లు

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి రిమాండ్

కడ్తాల్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో చోటుచేసుకుంది. శుక్రవారం సీఐ శివప్రసాద్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 19న గణేశ్ నిమజ్జన బందోబస్తుకు వెళ్లిన కానిస్టేబుల్ మహేశ్, హోంగార్డు లక్ష్మణ్‌పై తండాకు చెందిన నేనావత్ సేవ్యానాయక్ దురుసుగా ప్రవర్తించాడు. అసభ్యపదజాలంతో దూషిస్తూ.. వారిని నెట్టేశాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు సేవ్యానాయక్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

భూమి కాజేశారని ఫిర్యాదు

కొందుర్గు: తప్పుడు పత్రాలు సృష్టించి తమకు రావలసిన భూమిని కాజేశారని జడ్చర్లకు చెందిన మహ్మద్ ఖలీల మతీన్, మోసీన్ సమద్ తదితరులు శుక్రవారం కొందుర్గు పోలీసులను ఆశ్రయించారు. తమ ముత్తాత అబ్దుల్ ఖయ్యూమ్ పేరిట తంగెళ్లపల్లి 370 సర్వేనెంబర్‌లో గుంట 27గజాల భూమి ఉందన్నారు. మేము తాతల కాలం నుంచే ఊరూరాతిరిగి జాతర్లో బుక్కా అమ్ముకుంటు జీవనం సాగించేవారమన్నారు. ఈ క్రమంలో తాము జడ్చర్ల పట్టణంలో స్థిరపడ్డామని ఫిర్యాదులో పేర్కొన్నారు. తంగెళ్లపల్లిలో తమ భూమిని వీరన్నపేట గ్రామానికి చెందిన జహంగీర్ తప్పుడు అఫిడవిట్, మరణధ్రువపత్రం సృష్టించి తమకు రావలసిన భూమిని కాజేశాడని పేర్కొన్నారు. 80 ఏళ్ల క్రితం మరణించిన తమ ముత్తాత 2014లోమరణించినట్లు డెత్‌సర్టిఫికేట్ సృష్టించారని వాపోయారు. సదరు భూమిని గుర్రంపల్లికి చెందిన పెంటయ్యకు విక్రయించారని ఈ విషయంలో సరైన విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- లేదంటే 23న కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తాం
- మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న

ఇబ్రహీంపట్నం: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు యాలమోని స్వప్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు సీఐటీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం, మంచాల మండల విద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు నెలల తరబడి బిల్లులు, వేతనాలు అందక వారు అప్పులు చేసి వంటలు చేస్తూ ఇబ్బంది పడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పది వేల వేతనం ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారని.. హామీ అమలు చేయకపోగా మధ్యాహ్న కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఈనెల 23న కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ, మధ్యాహ్న భోజన కార్మికులు సరిత, అలివేలు, సుగుణమ్మ పాల్గొన్నారు.



తలకొండపల్లి: ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



ఇబ్రహీంపట్నం: ఎంఈఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

అప్పు చేసి వంటలు

తలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే మంజూరు చేయాలని సీపీఎం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. బిల్లులు అందక కార్మికులు అప్పు చేసి వంటలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షురాలు రమాదేవి, మంజుల, లక్ష్మమ్మ, అంజమ్మ, లక్ష్మీదేవి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమానికే ఊపిరి సాయిచంద్

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: మలిదశ తెలంగాణ ఉద్యమానికి సాయిచంద్ ఊపిరి అని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం సాయిచంద్ జయంతి వేడుకలను యువనాయకుడు కేశని మహేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో పాటు సాయిచంద్ సతీమణి రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మలిదశ ఉద్యమ సమయంలో ఆయన ఆటపాటలతో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహనీయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో హరీశ్ అన్న యువసేన జిల్లా నాయకులు హెచ్‌ఆర్ మహేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు జోగు వీరయ్య, రామకృష్ణ, లాయక్‌అలీ, మహేశ్, అంజి, డాన్ శ్రీను, సాయిలు, రాజేందర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



సాయిచంద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జైపాల్‌యాదవ్, రజనీ సాయిచంద్ తదితరులు

భార్యను హత్య చేసిన భర్తకు జీవితఖైదు

- రూ.25వేల జరిమానా
- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. పట్టణ సీఐ విజయకుమార్ కేసు వివరాలను వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మేడిగడ్డతండాకు చెందిన జటావత్ లలిత(30)కు ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని గుండ్యాతండాకు చెందిన జటావత్ రమేశ్‌తో పన్నెండేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక కుమారుడు. రమేశ్ వ్యసనాలకు బానిసవ్వడంతో కాపురంలో కలహాలు మొదలయ్యాయి. దీంతో భార్య లలితను నిత్యం వేధింపులకు గురిచేసేవాడు. పెద్దలు ఎన్ని సార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా తీరు మార్చుకోలేదు. ఈ క్రమంలో 2020 అక్టోబర్ 20న ఎప్పటిలాగే ఇంటికి వచ్చిన రమేశ్ భార్యను అంతమొందించాలని నిర్ణయించుకుని గొంతు, ఇతర శరీర భాగాలపై కత్తితో పొడిచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న లలిత తల్లి, సోదరులు అక్కడకు చేరుకుని తీవ్ర రక్తస్రావంతో కొట్టుమిట్టాడుతున్న ఆమెను ప్రథమ చికిత్స అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో 2020 నవంబర్ 2న చికిత్స నిమిత్తం పట్టణంలోని శివరాంనాయక్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతున్న లలిత 2020 నవంబర్ 5న మృతి చెందింది. భర్త కత్తితో దాడి చేయడంతోనే లలిత మృతి చెందిదని రమేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి పాత్లావత్ పీరీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పరారీలో ఉన్న రమేశ్‌ను పట్టుకున్న పోలీసులు జైలుకు పంపించారు. అనంతరం నిందితుడు బెయిలుపై బయటకు వచ్చాడు. అప్పటి ఎస్‌హెచ్‌ఓ శ్రీధర్‌కుమార్ పూర్తి ఆధారలను సేకరించి కోర్టులో చార్జిషీట్ వేశారు. కేసును నిశితంగా పరిశీలించిన ఎల్బీనగర్‌లోని జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు నిందితుడికి జీవిత ఖైదు, రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. దీంతో రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



సీఐ విజయకుమార్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

వనస్థలిపురం ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ ఘట్టుమల్లు

అబ్దుల్లాపూర్‌మెట్: సీటింగ్ సామర్థ్యానికి మించి.. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బి.ఘట్టుమల్లు, ఇన్‌స్పెక్టర్ ఆర్.శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. పెద్దఅంబర్‌పేట శివారులోని రమాదేవి పబ్లిక్ స్కూల్‌కు వెళ్లే దారిలో విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం పాఠశాల వాహనాలు, ప్రైవేటు వాహనాల తనిఖీకి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన తనిఖీల్లో మూడు వాహనాలకు జరిమానా విధించారు. నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తీసుకునేందుకు ప్రతీరోజు ఉదయం సాయంత్రం వాహనాల తనిఖీ చేపడతామన్నారు.



వాహనాలు తనిఖీ చేసి జరిమానా విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బాలుడి బలవన్మరణం

మొయినాబాద్: కడుపునొప్పి బాధ భరించలేక ఓ బాలుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని అజీజ్ నగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మంగలి శివకుమార్(17) కొంత కాలంగా కడుపులో మంట, నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో కడుపునొప్పి ఎక్కువ కావడంతో బాధ భరించలేక ఇంట్లో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగిరం



తాపీ మేస్త్రీలతో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధులు

శంకర్‌పల్లి: మార్కెట్‌లో లభ్యమయ్యే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణం వేగిరమవుతుందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ శివకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని మోకిల గ్రామంలో మాధపూర్ స్టీల్ మార్కెటింగ్ షాప్‌లో డీలర్‌తో పాటు 20మంది మేస్త్రీలతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఇంజనీర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో భారతి అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ ఫైవ్ స్టార్ గ్రేడ్ సిమెంట్ విడుదలైందన్నారు. ఇతర సిమెంట్‌లతో పోలిస్తే వేగంగా పనిచేస్తోందని స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారిల నిర్మాణానికి సరైన ఎంపికన్నారు. వినియోగదారులకు కావాల్సి న మేరకు సాంకేతిక సాయం అందిస్తామన్నారు. స్లాబ్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి పరిశీలిస్తారని చెప్పా రు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ మార్కెటింగ్ అయ్యప్పరెడ్డి, 20 మంది తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ప్రక్షాళనకు వేళాయెరా!



- 'లోపభూయిష్టంగా' నగర పోలీసు కమిషనరేట్
- ఎవరికి వారుగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు
- పట్టులేని వారితో పాటు కట్టు తప్పిన వాళ్లు సైతం
- దృష్టి పెట్టిన నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్
- వివిధ మార్గాల్లో సమాచారం సేకరిస్తూ విశ్లేషణలు



సాక్షి, సిటీబ్యూరో: కొందరికి సిటీ పోలీసింగ్‌పై అవసరమైన స్థాయిలో పట్టు లేదు... మరికొందరికి కింది స్థాయి వారికి వేధించడం మినహా మరో పని తెలీదు... ఇంకొందరు కట్టు తప్పి వసూళ్ల ప్రారంభించారు.. ఇలా లోపభూయిష్టంగా మారిన నగర పోలీసు కమిషనరేట్‌పై రెండోసారి కొత్వాల్‌గా వచ్చిన సీవీ ఆనంద్ ప్రత్యేక దృష్టి పెట్టారు. గడిచిన ఎనిమిది నెలల్లో చోటు చేసుకున్న పరిణామాలు, వాటి పర్యవసానాలను బేరీజు వేస్తున్నారు. గణేష్ ఉత్సవాలు, మిలాదున్నబీ ముగియడంతో భారీ స్థాయిలో ప్రక్షాళనకు కొత్వాల్ సిద్ధమవుతున్నారు. ఇందుకు గాను ఆయన వివిధ మార్గాల్లో అవసరమైన సమాచారం సేకరిస్తున్నారు.

ఐపీఎస్‌లలో అనేక రకాలు...

ఇతర యూనిట్లలో మాదిరిగానే నగర కమిషనరేట్‌లో పని చేస్తున్న ఉన్నతాధికారుల్లో ఐపీఎస్‌లు, రాష్ట్ర పోలీసు సర్వీసుకు చెందిన వారు ఉన్నారు. ఇక్కడ పని చేస్తున్న ఐపీఎస్ అధికారుల్లో అనేక రకాలైన వారు ఉన్నారు. కొందరికి సిటీ పోలీసింగ్‌పై ఏ మాత్రం పట్టులేకపోవడంతో తమకు అప్పగించిన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారు. ఈ ప్రభావం సామాన్యుడి దైనందిన జీవితంపై అనునిత్యం ఉంటోంది. మరోపక్క కొందరు అధికారులను కలవడం సామాన్యులతో పాటు సమాచారం అందించే వారికీ దుర్లభంగా మారుతోంది. ఈ కారణంగానే ఇటీవల ఉద్రిక్తతల సమయంలో పోలీసులు అవసరమైన స్థాయిలో స్పందించలేకపోయారనే ఆరోపణ ఉంది. ఇంకో అధికారిని తన కింద పని చేస్తున్న వారు కలవాలన్నా అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన దుస్థితి. మరో అధికారి అయితే కింది స్థాయి వారిపై ఒత్తిడి తెచ్చి, వేధించి 'ముడి సరుకు' తెప్పిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో వివాదాస్పదుడిగా మారిన మరో అధికారి ప్రవర్తనకు సంబంధించిన అసంతృప్తులు కోకొల్లలు.

రాజ్యమేలుతున్న 'రాష్ట్ర అధికారులు'...

నగరంలో పని చేస్తున్న ఉన్నతాధికారుల వైఖరిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్న 'రాష్ట్ర అధికారులు' రెచ్చిపోతున్నారు. ఓ జోన్‌లో పని చేస్తున్న 'లెఫ్టినెంట్' తన పై అధికారిని ఏ మాత్రం పట్టించుకోవట్లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా సదరు ఉన్నతాధికారిని కలవాలని, విషయం ఉప్పందించాలని ప్రయతిస్తే ఆయనే అడ్డుకుంటున్నారు. తనకు అనువైన, అనుకూలమైన అంశాలను మాత్రమే పైకి పంపిస్తున్నారు. ఓ ఏసీపీ స్థాయి అధికారి సివిల్ వివాదంలో తలదూర్చాడు. స్థలం పొజిషన్ ఇప్పించడానికి రూ.30 లక్షలు దండుకున్నాడు. ఈ వ్యవహారంలో ఆయన కింద, పైన పని చేసే అధికారులనూ తప్పుదోవ పట్టించాడు. మరో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ల 'మర్దన' వ్యవహారం జోరుగా సాగుతోంది. వీరు ఎవరికి వారుగా తమ పరిధిలోని మసాజ్ సెంటర్ల నుంచి భారీ స్థాయిలో వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎవరికి వారు తమకు కప్పం కట్టని పార్లర్స్‌పై దాడులు, కేసులు అంటూ బెదిరిస్తున్నారు. కొన్ని స్పా సెంటర్లలో పని చేసే థెరపిస్టులనూ బెదిరిస్తూ తమ వసూళ్ల టార్గెట్లు పూర్తి చేసుకుంటున్నారు. వీరి వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది.

అన్ని స్థాయిల్లోనూ భారీ మార్పు చేర్పులు...

నగర నిఘా విభాగమైన స్పెషల్ బ్రాంచ్ పని తీరు కొన్నాళ్లుగా గతి తప్పింది. దీనికి జాయింట్ సీపీ లేకపోవడం, ఉన్న డీసీపీ సైతం ఇన్‌చార్జ్ కావడం, ఆయన తన జోన్‌కు సంబంధించిన పనులతోనే తలమునకలు కావడంతో పనితీరు కుంటుపడింది. కేవలం కొన్ని అంశాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ సమాచార సేకరణకు పరిమితమైంది. ఇలాంటి అనేక అంశాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న కొందరు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు భారీ స్థాయిలో వసూళ్లకు తెరలేపారని తెలుస్తోంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న కొత్త కొత్వాల్ సీవీ ఆనంద్ నగర పోలీసు విభాగాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రతి అధికారికీ సంబంధించిన సమాచారం సేకరిస్తున్నారు. కేవలం స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్‌లపై ఆధారపడట్లేదు. తనకు ఉన్న విస్తృత పరిచయాలను వినియోగించుకుని వివిధ మార్గాల్లో సంగ్రహిస్తున్నారు. వీటన్నింటినీ ఆధారంగా చేసుకున్న నగర కమిషనరేట్‌లో భారీ ప్రక్షాళనకు కసరత్తు చేస్తున్నారు. ఎస్సై నుంచి అదనపు సీపీ వరకు అన్ని స్థాయిల్లోనూ పెద్ద ఎత్తున మార్పుచేర్పులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.